మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# గ్రామ స్వరాజ్యంతో దేశం అభివృద్ధి...

**రూ.45లక్షల రూపాయల అభివృద్ధి పనుల ప్రారంభం : ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, జనవరి 4, ప్రభాతవార్త :** గ్రామస్వరాజ్యంతో గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని గాంధీ చెప్పిన మాటలకు అనుగుణంగా ప్రభుత్వం గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో జెడ్పి చైర్మన్ లోకనాథ్ రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి రూ. 21 లక్షల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, రూ. 24 లక్షల నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో నిర్మించిన నూతన ఆరోగ్య ఉప కేంద్రం ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే తూడి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు గ్యారెంటీలను అమలు చేశామని మిగతా నాలుగు గ్యారెంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలను గ్రామీణ ప్రజలకు చేరువ చేయడం ద్వారా వారి ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరచడంలో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరితా తిరుపతి, ఎంపీపీ రఘు ప్రసాద్, రెడ్డి, జెడ్పిటిసి సభ్యులు రఘుపతిరెడ్డి ఎంపీటీసీ సభ్యురాలు వరలక్ష్మి శేఖర్, పెద్దమందడి సర్పంచ్ వెంకటస్వామి వెల్టూర్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి చీకరు చెట్టు తండా సర్పంచ్ రాధాకృష్ణ అమ్మపల్లి సర్పంచ్ రమేష్ యాదవ్, డిఆర్డిఓ నర్సింహులు, పంచాయతీ అధికారి సురేష్, డిప్యూటి డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ సాయినాథ్ రెడ్డి, తాసిల్దార్ కిషన్ ఎంపీడీవో అఫ్జలుద్దీన్, నాయకులు వెంకటయ్య వెంకటేష్ మద్దిలేటి సురేష్ రాములు యాదవ్, మహేష్ రెడ్డి రాజ వర్ధన్ రెడ్డి, శివా యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి

# అభివృద్ధి చెందిన దేశమే సంకల్పం..

**బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపి జితెందర్‌రెడ్డి**

**భైరంపల్లిలో వికసిత్ భారత్ కార్యక్రమం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 04 ప్రభాతవార్త :** భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే బిజెపి సంకల్పమని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎంపి జితెందర్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం జడ్చర్ల నియోజకవర్గం మిడ్జిల్ మండలం, భైరంపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మిథున్‌రెడ్డితో కలిసి ఆయన ప్రసంగించారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ భారత ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటినన్నింటిని అందరికి తెలిసేలా తద్వారా అవన్ని అందరి కి అందేలా చూడడమే వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్క భారతీయ పౌరులు ఈ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాహితిరెడ్డి, బిజెపి మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జితేందర్‌రెడ్డి

# జిల్లా కలెక్టర్‌గా బిఎం సంతోష్ బాధ్యతలు..

**అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషిచేస్తా**

**గద్వాల ప్రతినిధి, జనవరి 04 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు నా వంతు కృషి చేస్తానని, జిల్లా అధికారులు అందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో నూతన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్‌ను అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాసులు (రెవెన్యూ) మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణప్రభుత్వం అమలుచేసే సంక్షేమపథకాలు ప్రతి పేద వాడికి చేరేలా ప్రభుత్వ అధికారులు కృషిచేయాలని తెలిపారు. గద్వాలజిల్లా విద్య, వైద్యంలో వెనుకబడి ఉన్నందున, విద్య, వైద్యంలో జిల్లాను ముందుకు తీసుకువెళ్లేందుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక చొరవ తీసుకుంటానని నావంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. గతంలో వనపర్తి ఉమ్మడిమహబూబ్‌నగర్‌జిల్లాలో శిక్షణపొందినందున గద్వాల జిల్లాపై అవగాహన ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాస్, ఆర్డీఓ చంద్రకళ, ఏఓ భద్రప్ప, జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్లు ఇతర అధికారులతో నూతన కలెక్టర్ బిఎం సంతోష్

# గ్రామస్థాయిలో టిడిపిని బలోపేతం చేద్దాం..

**టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు**

**చిన్నచింతకుంట, జనవరి 04 ప్రభాతవార్త :** గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి డి. జనార్థన్ స్వగ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ పేదల పెన్నిధి, బడుగు ఆశాజ్యోతి, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను నేటికి పేదల గుండెల్లో నిలిచిపోయారని ఆయన ఆశయ సాధనకై ప్రతి టిడిపి కార్యకర్త పని చేస్తూ బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని తెలిపారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు విద్య, వైద్యంతో పాటు పల్లెల అభివృద్ధికి కృషి చేశారని ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇంఛార్జి బాలప్ప, పార్లమెంట్ మైనార్టీ ఇంఛార్జి షబ్బీర్ బాబు, పార్లమెంట్ యూత్ నాయకులు నవీన్‌కుమార్, నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు వి.రవికుమార్, తిరుపతయ్య, విష్ణు, రాజు, శ్రీహరిగౌడ్, సత్యనారాయణరెడ్డి, దశరథ, చిన్నప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విప్లవాత్మాక మార్పులు తీసుకొని రావాలి...

- **టీఎస్ ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ...**
- **రాష్ట్ర అబ్కారీ శాఖ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 04 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకుంటున్న నిర్ణయంతో ఆంగ్ల నూతన సంవత్సరం 2024 విద్యానామ సంవత్సరంగా కాబోతున్నట్లు రాష్ట్ర అబ్కారీ శాఖ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ యేడాది మెగా డీఎస్సీ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరించబడుతాయని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలు లేకుండా, మూతబడ్డ పాఠశాలలు తెరుచుకొని ప్రతి తండాలో కొత్త వైభవం సంతరించుకుంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూటీఎస్) డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన కలెక్టర్, ఎమ్మెల్యేలు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మారుమూల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు తప్పనిసరిగా ఉండాలని, ఉపాధ్యాయుల కొరత తీర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కర్తవ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు యం.పర్వత్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు కొత్త శ్రీధర్‌రావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.రమేష్, జిల్లా అధ్యక్షులు తదితరులు ఉన్నారు.





రాష్ట్ర అబ్కారీ శాఖ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్

## అవినీతి రహిత ప్రజాపాలన అందించడమే

# కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం...

**అమరవీరుల అకాంక్షలు నేరవేరే విధంగా ప్రజల అభిష్టం మేరకు ప్రజా పాలన కొనసాగిస్తాం...**

**- రాష్ట్ర అబ్కారీ శాఖ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు**



పర్యాటక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల ప్రతినిధి, జనవరి04 ప్రభాతవార్త:** ఎంతో మంది ప్రాణ త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అమర వీరులు, ప్రజల అకాంక్షలు, అభీష్టం మేరకు స్వచ్ఛమైన, పారదర్శకమైన అవినీతి రహిత ప్రజాపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అబ్కారీ శాఖ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలు హర్షించే విధంగా కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. గురువారం ఉయం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, సుకుంట్ల దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్న, పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌లతో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు పోరాటం చేసి ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేసి విద్యార్థులు, ఉద్యోగులు సకల జనులు పోరాటం చేసినందుకు అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందన్నారు. కానీ అమరవీరుల అకాంక్ష, ప్రజల అభీష్టం మేరకు గత ప్రభుత్వం పరిపాలన కొనసాగించలేదని ప్రజలు ఆగ్రహించి కాంగ్రెస్ పార్టీకి పట్టాం కట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల అకాంక్షలు నేరవేరే విధంగా ప్రజల అభీష్టం మేరకు ప్రజా పాలన కొనసాగిస్తామన్నారు. ఇందుకు ఆయా శాఖల అధికారులు వారి సిబ్బంది పారదర్శకంగా అవినీతి రహితంగా ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన పారదర్శకమైన పాలన అందించేందుకు అధికార యంత్రాంగం ప్రజా ప్రతినిధులు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో నాగర్‌కర్నూల్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచి నూతన ఒరవడికి నాంది పలుకుదామని మంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయా శాఖల వారిగా మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అందులో అతి ప్రధానమైన ఇరిగేషన్, మిషన్ భగీరథ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, రోడ్ల భవనాలు, విద్యుత్, గిరిజన సాంఘీక సంక్షేమ శాఖలపై సమీక్షా నిర్వహించారు. మొదటగా మిషన్ భగీరథపై సమీక్ష నిర్వహిస్తూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 41వేల కోట్ల నిధులతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం చేపట్టిందని, కానీ సరైన ప్రణాళిక, పర్యవేక్షణ సరిగ్గా లేక మిషన్ భగీరథ పథకం లోపభూయిష్టంగా తయారైందన్నారు. ఇప్పటికి చాలా గ్రామాల్లో ఇండ్లకు మిషన్ భగీరథ నీరందడం లేదన్నారు. నిర్వహణ చాలా అధ్వాన్నంగా ఉందని, నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేక కలుషిత నీరు సరఫరా కావడంతో ప్రజలు నీరు తాగడం లేదన్నారు. తమ నియోజకవర్గంలోని చాలా ఆవాసాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి అధికారులతో వివరణ కోరగా సమగ్ర సమాచారం, వివరణ రాకపోడంతో మంత్రి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం, పది రోజుల్లో అన్ని గ్రామాల్లో సూక్ష్మస్థాయిలో పరిశీలన చేసి సమస్యలపై నివేధిక సమర్పించాలని అందుకు జిల్లా కలెక్టర్ బాధ్యతలు తీసుకోవాలన్నారు. సమస్య ఎక్కడ ఉందో కనుక్కొని పరిష్కరించాలని, సూక్ష్మస్థాయిలో పరిశీలన చేసి నివేధిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ఏజెన్సీలకు బిల్లులు గుడ్డిగా చెల్లించవదని, ఆవాసాలకు ఎంత తాగునీరు సరఫరా అయ్యిందనే నివేధికపై స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు గ్రామ మహిళా సమాఖ్య సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, మహిళల సంతకం లేకుండా బిల్లులను జనరేట్ చేయడానికి వీలులేదని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి, - మిగతా3లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

# 15 రోజుల్లో పూర్తి చేయాలి..

**రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు.. కస్టమ్ రైస్‌పై రెవెన్యూ అదనపు కలెక్టర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 04 ప్రభాతవార్త :** ఈ సంవత్సరం వానకాలానికి సంబంధించి మిగిలిపోయిన సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్)ను 15 రోజుల్లో పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు అన్నారు. గురువారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని ఎన్ఐసి సమావేశ మందిరంలో వానాకాలం సిఎంఆర్ చెల్లించాల్సిన రైస్‌మిల్లర్లు, రైస్‌మిల్లుల అసోసియేషన్ బాధ్యులు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వానాకాలానికి సంబంధించి లక్షా 39 వేల 330.920 మెట్రిక్ టన్నుల సిఎంఆర్‌ను మిల్లర్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు 82,905.20 మె.ట. సిఎంఆర్‌ను చెల్లించి 89శాతం సమర్పించారని తక్కిన 10446.466 మెట్రిక్ టన్నుల సిఎంఆర్‌ను 15 రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లో సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సిఎంఆర్ చెల్లించనట్లయితే సంబంధితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమేకాకుండా, రెవెన్యూ రికవరీ చట్టప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. 15రోజుల్లో వానాకాలం సిఎంఆర్ సమర్పించడంతోపాటు రబికి సంబంధించి సీఎంఆర్ సమర్పించడం ప్రారంభించాలని అన్నారు. వానాకాలం సిఎంఆర్ పూర్తి చేసిన రైస్‌మిల్లర్లు జిల్లాలో రబీకి సంబంధించిన సీఎంఆర్‌ను ఇప్పటి వరకు 18శాతం సమర్పించాని ఆయన తెలిపారు. ఈ రబీలో 1,12,770.68మె.ట సిఎంఆర్‌ను చెల్లించేందుకు నిర్దేశించగా ఇప్పటివరకు 13845.800మె.టన్ను సిఎంఆర్‌ను ప్రభుత్వానికి చెల్లించారని ఆయన పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ డిప్యూటి తహసిల్దార్‌లు ప్రతిరోజు మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు కృష్ణయ్య, సెక్రెటరీ విజయకుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటి తహసిల్దార్‌లు తదితరులు సీఎంఆర్ చెల్లించాల్సిన రైస్ మిల్లుల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు రెవెన్యూ కలెక్టర్ మోహన్‌రావు



హాజరైన అధికారులు

# వేగవంతంగా ప్రజాపాలన..!


- **నేటి నుంచి డేటా ఎంట్రీ ప్రారంభం**
- **ఈనెల 17వరకు పూర్తి చేసేందుకు చర్యలు**
- **అధికారులను ఆదేశించిన కలెక్టర్లు**
- **జిల్లాల వారీగా ఆపరేటర్ల నియామకం**
- **మహబూబ్‌నగర్ జిల్లాకు 400మంది గుర్తింపు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 4, ప్రభాతవార్త :** ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేలా అధికారం యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దరఖాస్తుల ప్రక్రియ రేపటితో ముగియనున్న నేపథ్యంలో డేటాను కంప్యూటర్‌లో భద్రపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు ఆయా జిల్లాల్లో కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. గురువారం నుంచి డేటా ఎంట్రీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి 400మంది డేటా ఆపరేటర్లను గుర్తించి శిక్షణ ఇస్తున్నారు.

**ఆపరేటర్లకు శిక్షణ..** ప్రజాపాలనకు సంబంధించి గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తులను డేటా ఎట్రీ ఆపరేటర్ల ద్వారా కంప్యూటర్‌లో పొందుపర్చాలని ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశించారు. ఈమేరకు ఆపరేటర్లను నియమించుకోవాలని సూచించారు. గురువారం నుంచే దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రారంభించనున్నారు. దరఖాస్తు ఎంట్రీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం కార్యాలయాల్లోనే జరపాలని ఆదేశించారు. ప్రైవేట్ సంస్థలకు, ప్రైవేట్ కార్యాలయాలకు అప్పగించవద్దని ఆదేశాలు జారీ చేశారు. డేటాను భద్రంగా అవగాహనతో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైతే మరింత మంది ఆపరేటర్లను ఏజెన్సీల నుంచి నియమించుకోవాలని సూచించారు.

**రేపటితో ఆఖరు..** ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులను స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగియనున్నది. ఎట్టి పరిస్థితుల్లోనే అన్నిమండలాలు, మున్సిపాలిటీలు, గ్రామాల్లో 6వ తేదీ సాయంత్రం వరకు పూర్తిస్థాయిలో దరఖాస్తులు స్వీకరించేలా ప్రణాళికలు తయారుచేశారు. డేటా పూర్తిభద్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే కౌంటర్ ఇన్‌చార్జిలను సైతం తీసుకోవాలని కలెక్టర్ల నుంచి ఆదేశాలు ఉన్నాయి. డేటాను భద్రంగా ఉంచే బాధ్యత టీం లీడర్లకు అప్పజెప్పారు.

**మూడు విడుతల్లో డేటా ఎంట్రీ..** ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రీకి మహబూబ్‌నగర్ జిల్లాలో 213 కంప్యూటర్లు, 400మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాం. డేటా ఎంట్రీ పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. మూడు విడుదతల్లో డేటా ఎంట్రీ చేసేలా ఏర్పాటు చేశాం. ఆపరేటర్లను శిక్షణ ఇస్తున్నాం. ఈనెల17వరకు డేటా ఎంట్రీ పూర్తయ్యేలా ఆదేశించాం.





# సమస్యలు పరిష్కరిస్తా..!

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**ఎమ్మెల్యేను కలిసిన షేక్‌పల్లి గ్రామస్తులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 04 ప్రభాతవార్త :** సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. హన్వాడ మండలానికి చెందిన షేక్‌పల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆ గ్రామంలో ఉన్న సమస్యలైన శేక్‌పల్లి, చెల్మా నాయక్ కుంట తండా, షేక్ పల్లి నుండి కొండ్రెడ్డిపల్లి వరకు రోడ్డు అవసరం ఉందని, అలాగే ఎల్లంబా యి తండాలో నీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసు కువెళ్లారు. వెంటనే స్పందించి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తా నని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు టంకర కృష్ణయ్య యాదవ్, మారెపల్లి సురెందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు బొట్టు శ్రీను, బత్తుల శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు సేవకుడిగా పని చేస్తా..

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**పెబ్బేరు, జనవరి 4, ప్రభాతవార్త :** మనస్ఫూర్తిగా అశ్వీర్వదించిన ప్రజలకు సేవకుడిగా, ఒక బిడ్డగా సేవ చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. గురువారం కంచిరావు పల్లి, గుమ్మడం గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ప్రజా పాలనలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ఇప్పటికే రెండు పథకాలను అమలుపరచామని, మిగిలిన నాలుగు పథకాలను కూడా 100 రోజుల లోపు అమలుపర్చి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. గత పాలనలో పాలకుల అవినీతి, ఆక్రమణలు, భూకబ్జాలు, అక్రమంగా సంపాదించిన వారి నుండి తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. త్వరలో శ్రీశైలం నీటింపు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. గ్రామానికి రెండు మూడు రోజుల బస్సు సౌకర్యం, ఇల్లు లేని వారికి గృహ నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఈఈ మేఘా రెడ్డి, సర్పంచు సువర్ణ, ప్రజా జేఏసీ కన్వీనర్ గాండ్ల శ్రీనివాస్, అక్కి శ్రీనివాస్ గౌడ్, విజయవర్ధన్ రెడ్డి, జిల్లెల్ల వెంకటరామిరెడ్డి, కావలి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డికి పలువురి నివాళి..!!

- **అంతిమ సంస్కారాలకు హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులు..**
- **అశ్రునయనాల మధ్య ఆల శశివర్ధన్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు..**
- **అన్న శశివర్ధన్‌రెడ్డి పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి..**



4లో

ఆల శశివర్ధన్‌రెడ్డికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు

## బిజేపిలో కలసిన నాగారం యువకులు

**-కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కొండ ప్రశాంత్‌రెడ్డి**

**దేవరకద్ర,జనవరి 04 ప్రభాతవార్త:** దేవరకద్రలో గురువారం మండలంలోని నాగారం గ్రామానికి చెందిన యువకులు బిజేపిలో కలిశారు.దేవరకద్ర బిజేపి నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి అధ్వర్యంలో దాదాపు పది మంది బిజేపిలో చేరారు.దీంతో వారికి పార్టీ కండువాలు కప్పి కొండ ప్రశాంత్‌రెడ్డి స్వాగతం పలికారు.ప్రధానమంత్రి నరేంద్ర మోది నాయకత్వం,సిద్దాంతాలు నచ్చి బిజేపిలో చేరుతున్నట్లు పార్టీలో కలసిన యువకులు తెలిపారు.ఈ సందర్భంగా కొండ ప్రశాంత్‌రెడ్డి వట్లాడుతూ పార్టీ పటిష్టతకు అందరూ సమిష్టిగా పాటుపడాలన్నారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగాపనిచేసి బిజేపి సత్తా చాటాలన్నారు.గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.ప్రతి కార్యకర్త,నాయకుడికి పార్టీ అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

**-కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్**

**వెల్దండ, జనవరి 04 ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి, రాఘాయిపల్లి గ్రామాల్లో గురువారం అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మెనిపెస్టోలో ప్రకటించిన విధంగా సంక్షేమ ఫలాలు అందుతాయని, 6 గ్యారెంటీ పథకాల్లో భాగంగా 5 పథకాలకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ భీమాను రూ.10లక్షలకు పెంచిందన్నారు. గానుగట్టు తండాలో తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గాలమ్మ, అచ్చాలు, పత్యానాయక్, ఆర్ఐ శంకర్‌నాయక్, ఏపీఎం రాములునాయక్, పంచాయతీ కార్యదర్శి అల్తాఫ్, బాల్ లక్ష్మయ్య,కొండలుయాదవ్ తదితరులు ఉన్నారు.



## క్రీడకారిణిని సన్మానించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**పెబ్బేరు,జనవరి 4,ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాలకు చెందిన నందిని గురువారం ఎమ్మెల్యే మేఘా రెడ్డి శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించారు.డిసెంబర్ 23న బిజినపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన అండర్ 17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రసాయికి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు.మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించి చదువుతో పాటు క్రీడలపై కూడా శ్రద్ద వహించిన పదవ తరగతి చదివే విద్యార్థిని నందినిని ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,మండల నాయకులు శ్రీనివాస్ గౌడ్,సురేందర్ గౌడ్ వెంకటరమణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అవిశ్వాసం అనేది ఒక అపోహ.... టి కప్పులో తుఫాన్..!

**ఐక్యత చాటుకున్న బి.ఆర్.ఎస్ కౌన్సిలర్ల బృందం**




**వనపర్తి టౌన్,జనవరి 4,ప్రభాతవార్త :** పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాము.నిరంజన్ రెడ్డి,రావుల.చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వములో ప్రజా సేవకు అంకితం అవుతా ము.బి.ఆర్.ఎస్ కౌన్సిలర్లు,నాయకులు,మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి,మాజీ ఎం.పి రావుల చంద్రశేఖరరెడ్డితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.మాలో సమన్వయ లోపం,సమాచారలోపం వల్ల మాలో బిన్నాభిప్రాయలు కలిగాయని వాటినీ సరిద్దిద్దుకొని ఐక్యమత్యంగా ప్రజా సేవకు అంకితం అయ్యి పార్టీ ప్రతిష్ట,నాయకుల విశ్వాసం నిలబెడతామని అన్నారు.నిరంజన్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి సలహాలు సూచనలతో పట్టణ అభివృద్ధి కొనసాగిస్తామని అన్నారు.నిరంజన్ రెడ్డి,మాట్లాడుతూ మీ రాజకీయ భవిష్యత్తు పై నేను ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి చేయూత అందిస్తానని అన్నారు.రావుల.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మన ఐక్యత మన బలమని కష్టాలు,నష్టాలు కలసి పంచుకొని పార్టీ అభివృద్ధికి తోడుగా ఉందామని అన్నారు.ఈ కార్యక్రమంలో చైర్మన్,వైస్ చైర్మన్ తో పాటు కౌన్సిలర్స్,బి.ఆర్.ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన సదస్సుకు ప్రజల నుండి స్పందన..

**వీపనగండ్ల,జనవరి 4,ప్రభాతవార్త :** మండలంలోని ప్రజా పాలన దరఖాస్తులకు ప్రజల నుండి మంచి స్పందన వచ్చినట్లు ఎంపీడీవో కథలప్ప ఎమ్మార్వో వరలక్ష్మి తెలిపారు.గురువారం నాడు 14 గ్రామపంచాయతీల లో 7413 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు.గురువారం నాడు వీపనగండ్లలో 1318 బొల్లారంలో 74 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు.ఈ దరఖాస్తులు గత నెల 28 నుండి ప్రజా పాలన సదస్సులు గ్రామాలలో ప్రారంభించగా ప్రజల నుండి వివిధ సమస్యల రూపేనా దరఖాస్తులు వరకు రావడం జరిగిందని వారు తెలిపారు.ఈ దరఖాస్తులు వచ్చినటువంటి సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడం జరుగుతుందని వారు తెలిపారు.వారితోపాటు ప్రజాపాలన సదస్సులో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి రైతుబంధు మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య సగనమోని వెంకటస్వామి అలియాస్ వైయస్ పొంగలి వెంకటరెడ్డి రైతు కిసాన్ సెల్ నాయకులు నక్క విష్ణు గోపి బాలిరెడ్డి రఘునాథ్ రెడ్డి మాజీ సర్పంచ్ గంగిరెడ్డి అధికారులు అంగన్వాడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## భారతీయ జనతాపార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి కలిసినా పట్టణ బిజెపి నేతలు ..

**వనపర్తి టౌన్,జనవరి 4,ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రానికి దగ్గరలో శ్రీ తిరుమలనాథ స్వామి దేవాలయము అభివృద్ధి పరుచుట మరియు ఆధ్యాత్మిక,వర్యాటక కేంద్రంగా అభివృద్ధి వరుచుట,మరియు పార్క్,కళ్యాణ మండపము ఏర్పాటు చేయుటకై తమరికి అభ్యర్థిచినా పట్టణ భారతీయ జనతాపార్టీ నేతలు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబి రెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బిజెపి బచ్చు రాము వనపర్తి పట్టణ ఉపాధ్యక్షుడు పీఎం రాము ఓం ప్రకాశ్ చారి పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా ఉంటాం...

**- ఆర్యవైశ్య మహాసభ విద్యాకమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్...- ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ**

**అచ్చంపేట, జనవరి 04 ప్రభాతవార్త:**అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మొల్కమామిడి గ్రామానికి చెందిన నిరుపేద ఆర్యవైశ్యుడు కొండూరు వెంకటరమణ ఇంట్లో బుధవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న గృహోపకరాలతో పాటు దుస్తులు, రూ.2లక్షల నగదు కాలి బూడిదయ్యాయి. ఈ విషయాన్ని మండల ఆర్యవైశ్య సంఘం ద్వారా సమాచారం అందుకున్న ఆర్యవైశ్య మహాసభ విద్యాకమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్,ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, రాష్ట్ర మహాసభ కార్యదర్శి విసనకర్రల చంద్రకుమార్‌లతో పాటు పలువురు ఆర్యవైశ్య సంఘం నేతలు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో తోటి ఆర్యవైశ్య కుటుంబ సభ్యులతో సేకరించి రూ.1లక్ష బాధితుడు కొండూరు వెంకటరమణకు తక్షణ ఆర్థిక సహాయంగా అందించారు. బాధిత కుటుంబానికి ఆర్యవైశ్య సంఘం తరుపున అండగా ఉంటామని భరోసా కల్పించారు. భవిష్యత్తులో ఏ అవసరం ఉన్న ఆదుకుంటామని ధైర్యమిచ్చారు. కార్యక్రమంలో మహాసభ కార్యవర్గ సభ్యులు బలుస శ్రీరాములు, సంబు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, అమ్రాబాద్, అచ్చంపేట, పదర, వెల్దండ, వంగూరు మండలాల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నీల శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, బలుస వేణుగోపాల్, ఉప్పు ఆంజనేయులు, మేడిశెట్టి సురేష్, జిల్లా నాయకులు పాపిశెట్టి శ్యాంసుందర్, మాలె శంకరయ్య, పాపిశెట్టి సురేష్, కందికొండ శ్రీధర్, పొలిశెట్టి నరేష్, వాడకట్టు వినోద్, గోవిందు రమేష్, కామిశెట్టి శ్రీనివాసులు, కందూరి పాండు తదితరులు ఉన్నారు.



బాధితుడు కొండూరు వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆర్యవైశ్య మహాసభ సంఘం నేతలు



బాధితుడు వెంకటరమణకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఆర్యవైశ్య సంఘ బంధు మిత్రులు

## ఆపద్బాంధవా వర్ధిల్లు...

**-డీఎన్ఆర్ సేవలకు నీరాజనం పలుకుతున్న మండల వాసులు**

**ఊర్కొండ, జనవరి 04 ప్రభాతవార్త:**ఆపద్బాంధవా వర్ధిల్లు... మీ సహాయ సహకారాలు మరువలేనివి... మీరు చేస్తున్న సామాజిక స్పృహకు అభినందనలంటూ కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డి సామాజిక సేవలను మండల ప్రజలు కొనియాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఊర్కొండ మండలం జకినాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అమ్మపల్లి తండా వద్యావత్ దేవేందర్ సతీమణి బుజ్జి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీఎన్ఆర్ రూ.5వేలు, జకినాలపల్లి గ్రామ సర్పంచ్ తలసాని అనిల్‌రెడ్డి రూ.5వేలు సమకూర్చారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి డీఎన్ఆర్, జకినాలపల్లి గ్రామ సర్పంచ్‌లు సమకూర్చిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, ఉప సర్పంచ్ భాస్కర్, మాజీ ఉప సర్పంచ్ చంద్రయ్య, నాయకులు ఈదమయ్య, కే.మహేష్, జంగయ్య తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ప్రజా పాలనతో ప్రజల అభ్యున్నతి...

**-ఆరు గ్యారెంటీలతో ప్రజల జీవన శైలిలో మార్పు... మాజీ పీసీసీ సభ్యులు, జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి**

**వంగూరు, జనవరి 04 ప్రభాతవార్త:**ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీ పథకాలతో ప్రజల జీవన శైలిలో మార్పులు తీసుకొచ్చి పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పాటు పడుతుందని మాజీ పీసీసీ సభ్యులు, జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా వంగూరు మండలంలోని జాజాల, కోనేటిపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో అభయ హస్తం 6 గ్యారెంటీల ధరఖాస్తులను జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి నిరంతరం పేదల కష్ట సుఖాల్లో పాలు పంచుకున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అట్టడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశ పెట్టి పేదలకు అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. ప్రజా పాలన అభయహస్తం గ్యారెంటీలకు ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను అమలు పరిచేందుకు కసరత్తు నడుస్తోందని ఆయన అన్నారు. ప్రతి పక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మకూడదని, కాంగ్రెస్ ప్రభుత్వం అనాటి నుంచి నేటి వరకు పేదలకు అండగా నిలిచిందని, ఇందిరమ్మ రాజ్యంలో కూడు, గూడు లేని ప్రజలకు అండగా నిలిచి నిలువడానికి నీడ కల్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పండిత్‌రావు, అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.



అర్హులైన లబ్ధిదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ

## కొనసాగుతున్న ప్రజా పాలన ధరఖాస్తుల స్వీకరణ..

**కల్వకుర్తిరూరల్, జనవరి 04 ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీల అభయహస్తం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన ప్రజాపాలన ధరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం కల్వకుర్తి మండల పరిధిలోని జిల్లెల, జీడిపల్లి, సుద్దకల్, తుర్కలపల్లి గ్రామాల్లో సంబంధిత అధికారులు ప్రజాపాలన సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో అభయహస్తం పథకానికి ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారులు తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీఓ ఆంజనేయులు ప్రజల నుంచి మహాలక్ష్మి భరోసా చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతితో పాటు తదితర పథకాలకు ధరఖాస్తులు తీసుకున్నారు. ప్రజా పాలన కార్యక్రమం ఈ నెల 6వ తేదీ వరకు గ్రామాల్లో కొనసాగుతుందని, ధరఖాస్తు చేసుకొని వారు ధరఖాస్తు చేసుకొని సంబంధిత గ్రామ కార్యదర్శులకు అందించాలన్నారు. జిల్లెల్ల గ్రామంలో 404, జీడిపల్లిలో 406, సుద్దకల్‌లో 461, తుర్కలపల్లిలో 466 ధరఖాస్తులు స్వీకరించినట్లు ప్రత్యేకాధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు గ్రామ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.



జిల్లెల్ల గ్రామంలో లబ్ధిదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి తహసీల్దార్ ఇబ్రహీం

## గోకుల్ చాట్ బేకరీని ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**కొత్తకోట,జనవరి 4,ప్రభాతవార్త :** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో అమడబాకుల గ్రామ మాజీ సర్పంచ్ మన్యం సోదరుడు నారాయణ నూతన ఏర్పాటు చేసిన బేకరీని గురువారం దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి ముఖ్యాతితులు హాజరై రిబ్బన్ కట్ చేసి బేకరీని ప్రారంభించారు.ముందుగా నిర్వాహకులు,కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.బేకరీలో ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.కౌంటర్ దగ్గరకు వెళ్లి కొనుగోలు దారులకు స్వీట్లు అందజేశారు.ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నారాయణ,విశాల్,కిషోర్,భగవంతు,బాలకొండ,శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు మాజీ జడ్పీటీసీ బాబు,కృష్ణారెడ్డి,ప్రశాంత్,మండల అధ్యక్షుడు బిచుపల్లి, ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,మిషేక్,వేముల శ్రీనివాస్ రెడ్డి,లతీఫ్,గొల్లబాబు,బోయజ్,రత్నం,బొందల ప్రశాంత్,సత్యారెడ్డి, బలరాం,నరేందర్ సాగర్,సాయిలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో బేకరీ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

## మన్యంకొండలో కొనసాగుతున్న ధనుర్మాసం పూజలు ..

**-ప్రతిరోజు తెల్లవారుజామున తిరుప్పావై పాశురపఠనం**

**దేవరకద్ర,జనవరి 04 ప్రభాతవార్త:** మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసం పూజలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది దేవస్థానంలో సాంప్రదాయరీతిలో నెల రోజుల పాటు ధనుర్మాసం పూజలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ దేవస్థానంలో ధనుర్మాసం పూజలు గత నెల 17న ప్రారంభమయ్యాయి.ఈ సందర్బంగా తెల్లవారుజామున పురోహితులు స్వామి వారికి ప్రత్యేక విశేష అభిషేకాలు,అర్చనలు నిర్వస్తున్నారు.అలాగే గోదాదేవి అలపించిన తమిళంలోనున్న తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారు.నిత్య అర్చనలు నిర్వహిస్తున్నారు.ఈ నెల 15 వరకు ఈ పూజలను నిర్వహిస్తారు.ఈ సందర్భంగా స్వామివారిని వివిధ ఆభరణాలు,పూలతో శోభాయమానంగా అలంకరించారు.దీంతో స్వామి వారు అలంకరణలో భక్త కోటికి దర్శనిస్తున్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య, పాలక మండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.మన్యంకొండ దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా భక్తుల దర్శనాల వేళల్లో మార్పులు చేశారు.స్వామి వారి ఆరగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆ మార్పులు చేశారు.దేవస్తానంలో ఈ మాసంలో ప్రతి రోజు ఉదయం 5.30నుండి రాత్రి 7.30 వరకు స్వామి వారి దర్శనం ఉంటుందని దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజులు తెలిపారు.కావున భక్తులు ఈ విషయాన్ని గమనించి దేవస్థానానికి సహకరించాలను వారు కోరారు.



మన్యంకొండలో పాశురాలను పఠిస్తున్న అర్చకులు

## 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**దేవరకద్ర,జనవరి 04 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం ముచ్చింతలలో గురువారం 2024 సంవత్సరపు కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే జి.మదుసూధనరెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి,గోపన్‌పల్లి యూత్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి,బుచ్చన్నలతో పాటు గోపన్‌పల్లి గ్రామా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నట్లు బుచ్చన్న తెలిపారు.

## ఐఎన్‌టీఎస్ఓ ఒలంపియాడ్ పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 04 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ స్థానిక ఈశ్వర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నవంబర్ నెలలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్ఓ లెవల్-1 ఒలంపియాడ్ పరీక్షలో పాల్గొని లెవల్-2కి 106 మంది విద్యార్థులు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ రాజీవ్ ప్రియదర్శన్ తెలిపారు. ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థులు అర్హత సాధించడంతో ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కోఆర్డినేటర్ మధుసూదన్, డీఎన్ శివకుమార్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన..

**ప్రజా సంక్షేమం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

**ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి**



**చిన్నచింతకుంట,జనవరి 04 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల వద్దకు పాలన తీసుకొస్తుందని స్థానిక ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం కురుమూర్తి, ముచ్చింతల గ్రామాల్లో అభయహస్తం గ్రామ సభలలో ఆయన పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని ఇప్పటికే రెండు పథకాలను అమలు పరిచామని మిగతా వాటిని త్వరలో అమలు చేస్తామని ఆయన తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ఆయన తెలిపారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరు అభయహస్తం గ్రామ సభల్లో దరఖాస్తులు సరళిని అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశాల్లో కురుమూర్తి గ్రామ సర్పంచ్ కవిత, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిఓ అనిల్, కో ఆప్షన్ మహమూద్, నాయకులు కథలప్ప, ఎస్. వెంకటేష్, సురేష్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు..

**బిజినేపల్లి,జనవరి 04 ప్రభాతవార్త :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం నుంచి బాలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు అన్ని గ్రామాల్లో ఇంటింటికి అందజేస్తున్నారు. అన్ని గ్రామాల్లోని ప్రధానాలయాల్లో గురువారం అక్షింతలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో నిర్మాణం జరుగుతున్న శ్రీరాముని దివ్య భవ్య మందిర ప్రాంభోత్సవం జనవరి 22, 2024న జరగనున్న నేపథ్యంలో ఈ వేడుకను ప్రతి ఇంట జరుపుకునే విధంగా తీర్థ ట్రస్టు నిర్ణయించింది. వేడుకను పురస్కరించుకుని దేశంలోని ప్రతిహిందూ కుటుంబానికి అయోధ్యలోని బాలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు, రామాలయ చిత్రపటము చేర్చాలని శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్టు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అయోధ్య నుండి తీసుకొచ్చిన అక్షింతలు శ్రీరామ సేవకుల ద్వారా ఇంటింటికి పంపిణీ చేయడం భక్తిభావం మధ్య ఓలలాడింది. ప్రతి ఇంటికి అక్షింతలు అందేవిధంగా నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ, వివిధ క్షేత్ర కార్యకర్తలు, వివిధ హిందూ ధార్మిక సంస్థలు పాల్గొన్నారు.

## వెల్డింగ్ ఇంజనీరింగ్ మోటార్ సంఘం అధ్యక్షులకు ఘన సన్మానం:యంఏ ఖాదర్ పాష

**వనపర్తి టౌన్,జనవరి 4,ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో వెల్డింగ్ ఇంజనీరింగ్ మోటార్ వైరింగ్ అధ్యక్షులకు వైస్ ప్రెసిడెంట్ లకు సలహాదారులకు కార్యదర్శులకు ఘనంగా శాలువతో సన్మానించిన తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు.యంఏ ఖాదర్ పాష.మరియు టీజేఏసీ జిల్లా కన్వీనర్ ప్రజా వాగ్గయా కారులు రాజారాం ప్రకాష్.. మాట్లాడుతూ... జిల్లాలో మంగళవారం రోజు జరిగినటువంటి సంఘం ఎన్నికల్లో వెల్డింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎన్నికైన సభ్యులను అధ్యక్షులు అయినటువంటి వారిని బ్రహ్మంగారి గుడి



పెన్షన్ హాలులో సభ్యులను సత్కరించడం జరిగింది. వారికి సంఘం నాయకులకు కర్షకులకు కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వారికి గుర్తించి ఇన్సూరెన్స్ ప్లాట్లు మరియు కులవృత్తుల సంఘాల భవనాలు కూడా ఏర్పాటు చేయాలని అదేవిధంగా అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని దృష్టికి తీసుకుపోతామని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు.వి.బ్రహ్మయ్య చారి గౌరవాధ్యక్షులు.వెల్డింగ్.అసోసియేషన్.ప్రెసిడెంట్ పి.కృష్ణయ్య,మేఘా ప్రెసిడెంట్ మోహన్..మోటర్ వైరింగ్ ప్రెసిడెంట్.శ్రీహరి.వైస్ ప్రెసిడెంట్.రామ కృష్ణ.శాంతయ్య.సలహాదారులు.రాము కార్యదర్శి.నరేందర్ గౌడ్ వైస్ ప్రెసిడెంట్.. తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.షఫీ.టౌన్ అధ్యక్షులు కె.రాఘు నాయుడు.రాజేష్ కుమార్ శెట్టి.తెలంగాణ ఉద్యమకారుడు గిరిజన అధ్యక్షులు.జాత్రునాయక్.మోచి సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ బాబు.వినోద్ ఆచారి.పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 24వ వార్డులో ప్రజాపాలన తనిఖీ చేసిన నూతన కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,జనవరి 04 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు బస్తీ దవాఖానలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని నూతన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి సీరియల్ నంబర్ ప్రకారంగా దరఖాస్తులను చెక్ చేసుకోవాలని అన్నారు. ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాలలో 24వ వార్డులో ఎంత జనాభా ఉందని, ఎన్ని కౌంటర్లు పెట్టారని, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను



మున్సిపల్ కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపిస్తున్నారా అని అడిగారు. దరఖాస్తు ఫారానికి దరఖాస్తుదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, జిరాక్స్‌లు జతచేసి అట్టి ఫారాన్ని కేటాయించబడిన కౌంటర్లలో తీసుకోవాలని, ప్రజల నుండి తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజల నుండి తీసుకునే దరఖాస్తులను, రిజిస్టర్‌లో నమోదు వివరాలను పరిశీలించారు. ప్రజలకు దరఖాస్తులు అందుబాటులో ఉంచారా, దరఖాస్తులు స్వీకరించిన అనంతరం రసీదు ఇవ్వాలన్నారు. వార్డులో 600 కుటుంబాలకు గాను 500ల దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. 90 శాతం దరఖాస్తుల స్వీకరణ జరిగిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, ఆర్‌డిఓ చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ నరసింహ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం..

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

**కొత్తకోట,జనవరి 4,ప్రభాతవార్త :** ఆరు గ్యారెంటీలు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.గురువారం మధనపురం మండలం అజ్జకొలు గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా హాభయహస్తం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యాతితులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సమస్యలు పరిష్కరించేందుకు ప్రజల వద్దకే కాంగ్రెస్



ప్రభుత్వం వచ్చిందని అన్నారు.ప్రజల సంక్షేమం,అభివృద్దే తమ ప్రభుత్వ లక్ష్యమని,ప్రజా పాలన సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను వంద రోజుల్లో నెరవేరుస్తామని పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని,ప్రజల చేత తిరస్కారానికి గురైన బిఆర్ఎస్ పార్టీకి,కేటిఆర్ కి కాంగ్రెస్ ను విమర్శించే అర్హత లేదన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లెపాగు ప్రశాంత్,కృష్ణారెడ్డి,వేముల శ్రీనివాస్ రెడ్డి,ప్రభుత్వ ఉన్నతాధికారులు,స్థానిక ఎంపీటీసీలు,సర్పంచ్ లు,కాంగ్రెస్ ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఒంటి గంట వరకు అధికారులే లేరు..!!

**- ఇది అధికారుల తీరు.. - ఫించన్ల కోసం జీపీ ముందు పడిగాడ్పులు కాచిన వృద్ధులు,వికలాంగులు,వితంతువులు..**



**భూత్పూర్,జనవరి 4,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం వృద్దులు,వికలాంగులు,వితంతువులకు ప్రతినెల ఇస్తున్న ఫించన్లు అమిస్తాపూర్‌లో గురువారం మధ్యాహ్నం వరకు ఇవ్వకపోవడంతో వృద్ధులు,వికలాంగులు,వితంతువులు గ్రామపంచాయతీ కార్యాలయం ముందు మధ్యాహ్నం ఒంటి గంట వరకు పడిగాడ్పులు కాచారు.వీరి దీనహీన పరిస్థితులు చూసి కొందరు యువకులు,గ్రామ పెద్దలు జిల్లా కలెక్టర్ జి రవికుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.సంబంధిత అధికారి వేరే గ్రామంలో ఫించన్లు ఇచ్చేందుకు వెళ్లినట్లు తెలిసింది.

**ఫించన్ ఇప్పిస్తానని వృద్దురాలి రెండు తులాల బంగారు గొలుసు చోరీ..**

అమిస్తాపూర్‌లో ఫించన్ ఇప్పిస్తానని ఓ మోసగాడు అమిస్తాపూర్ కెంద్యాల సుశీలమ్మ(65) అను వృద్దురాలి మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు కొట్టేసిన హైటెక్ చోరీ అమిస్తాపూర్‌లో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది.భూత్పూర్ పోలీసుల కథనం ప్రకారం అమిస్తాపూర్ గ్రామానికి చెందిన కుర్వ కెంద్యాల సుశీలమ్మ(65)ను ఇదే గ్రామానికి చెందిన మంగ అమృతమ్మ పెన్షన్లు ఇచ్చే అధికారి ఆగిరి బాలమ్మ ఇంటి దగ్గర వచ్చాడని చెప్పి సుశీలమ్మ వెంట తీసుకుని వెళ్లింది.అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తి పెన్షన్ ఎక్కువగా ఇప్పిస్తానని చెప్పి సుశీలమ్మను స్కూటర్‌పై ఎక్కించుకుని ఊరు చివరన ఉన్న బీసీ కాలనీ వరకు తీసుకెళ్లి స్కూటర్ ఆపి సుశీలమ్మ అను వృద్ధురాలి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని ఆమెను అక్కడే దించేసి వెళ్లిపోయాడని సుశీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

## పిల్లలను పాఠశాలలో చేర్పించాలి..

**జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటి ఛైర్మన్ లక్ష్మణ్‌రావు**

**లింగాల,జనవరి 04 ప్రభాతవార్త :** ప్రతిఒక్కరూ పిల్లలను పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటి ఛైర్మన్ లక్ష్మణ్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రపెంట గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుని చర్చించారు. బాల్యంలో వివాహాలు చేయకూడదని, 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని కోరారు. పోక్సో, చిల్డ్మారిజ్, బాల కార్మిక వ్యవస్థ తదితర చట్టాలపై అవగాహన



కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ మైలగాని శ్రీనివాసులు, సర్పంచ్ అక్కమ్మ, సన్నయ్య, గ్రామస్తులు నిరంజన్, గోవిందు పాల్గొన్నారు.

# ప్రజా పాలన గ్రామ సభలకు విశేష స్పందన..

**ఉప్పునుంతల, జనవరి 04 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత గ్యారంటీలను అమలు పరిచేందుకు మండలంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 6వ రోజైన గురువారం మండలంలోని పెద్దాపూర్, మొల్గర, కొరటికల్ గ్రామాలలో సర్పంచ్‌లు కొత్త శిరీష రవిందర్‌రావు, గోపిరెడ్డి రమేష్‌రెడ్డి (శోభన్‌రెడ్డి), శాంతాభాయిల అధ్యక్షతన జరిగిన గ్రామసభలకు పెద్దాపూర్, మొల్గర గ్రామ సభలకు ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు టీం లీడర్‌గా వ్యవహరించగా, కొరటికల్, తిప్పాపూర్ గ్రామసభలకు మండల పంచాయతీ అధికారి నారాయణ టీం లీడర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో జరిగిన గ్రామసభలో టీం లీడర్లు, ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు, మండల పంచాయతీ అధికారి నారాయణలు మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరు ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వారు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల రద్దీ కోసం ప్రజలకు దరఖాస్తులు అందజేయడమే కాక వాడిని పూర్తిచేసి అధికారులకు అందజేసేందుకు ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉండి సహకరిస్తామన్నారు. గ్రామ సభలలో ఎంపిడిఓ





పెద్దాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిడిఓ లక్ష్మణరావు

లక్ష్మణ్‌రావు, మండల పంచాయతీ అధికారి నారాయణ, సర్పంచ్‌లు గోపిరెడ్డి రమేష్‌రెడ్డి (శోభన్‌రెడ్డి), కొత్త శిరీష రవింద్రరావు, శాంతాబాయి, కొరటికల్ ఎంపిటిసి గోపిరెడ్డి అనురాధ, నాయకులు పెద్దాపూర్ మాజీ సర్పంచ్ వేముల నరసింహారావు, గోపిరెడ్డి రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌మేళా మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు లలిత, పంచాయతీ ఆపరేటర్లు బొజ్జ స్వప్న, స్వరూప, రెవెన్యూ వైద్యశాఖ, ఐకెపి, విద్యుత్, ఆశా కార్యకర్తలు,



కొరటికల్‌లో లబ్దిదారుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న మండల పంచాయతీ అధికారి నారాయణ

అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

**నేడ గ్రామసభలు...**

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని దేవదారికుంట తండా, లత్తీపూర్, సూర్య తండాలో గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు తెలిపారు. ఆయా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామసభలు విజయవంతం చేయాలని ఎంపిడిఓ కోరారు.

## ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం..

**ఉప్పునుంతల,జనవరి 04 ప్రభాతవార్త :** జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. సావిత్రిబాయి పూలే 193 జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతం మండల విద్యాశాఖ అధికారి రామారావు అధ్యక్షతన జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే తన భర్త సహకారంతో చదువుకుని శూద్రుల కోసం, బాలికల కోసం 1848 సంవత్సరంలో పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆ రోజుల్లో బాలికలకు, శూద్రులకు చదువుకోవడానికి అవకాశం లేదని పేర్కొన్నారు. కొందరు సావిత్రిబాయి పూలేపై బురద, నీళ్లుచల్లి అవమానకరంగా మాట్లాడిన పట్టువదలకుండా 52 పాఠశాలలు ప్రారంభించి విద్యనందించిన మహనీయురాలని పలువురు కొనియాడారు. సత్యశోధక్ సమాజ్ ద్వారా మూఢనమ్మకాలు రూపుమాపడానికి కృషిచేశారన్నారు. సావిత్రిబాయి పూలెను ఆదర్శంగా



వెల్టూరు హైస్కూల్లో సన్మానం పొందిన మహిళా ఉపాధ్యాయురాలు

తీసుకొని పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి కృషి చేయాలని మండల విద్యాధికారి రామారావు సూచించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాళ్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామారావుతో పాటు ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి చంద్రశేఖర్, కార్యదర్శి రామస్వామి, కాంప్లెక్స్ హెచ్ఎం రవిశేఖర్, ఉపాధ్యాయులు శేఖర్ ముదిరాజ్, జగదీష్, వెంకటేష్, వెంకటయ్య, బండారు జంగయ్య, చంద్రశేఖర్‌చారి, రామచంద్రారెడ్డి, పూజారి శ్రీనివాసులు, మహిళా ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి:ఎస్ఎఫ్ఐ డిమాండ్

**అమరచింత,జనవరి4,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే అధికారులు ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ డిమాండ్ చేశారు.గురువారం ఆత్మకూర్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలను ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తాగడానికి మంచినీరు లేక పాఠశాల దగ్గర ఉన్న హోటలలో విద్యార్థులు మంచినీరు తాగుతున్నారని ఆయన తెలిపారు.పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసిన తర్వాత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉప్పునీరు సరఫరా చేస్తున్నారని ఆయన అన్నారు.అలాగే పాఠశాలలో గదులు లేక ఉపాధ్యాయులు చెట్ల కింద విద్యను బోధిస్తున్నారని తక్షణమే ప్రభుత్వం పాఠశాలకు అదనపు గదులు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించడానికి పాఠశాలలో పి యు టి ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు క్రీడలకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం



ఆత్మకూర్ మున్సిపల్ కేంద్రంలో బాలుర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేశారు.తక్షణమే ప్రభుత్వం పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల సిద్ధమవుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్,కుమార్,అంజి,కృష్ణ,రాకేష్,సందీప్ వీరితోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి..

**వీపనగండ్ల,జనవరి 4,ప్రభాతవార్త :** ఉమ్మడి వీపనగండ్ల మండల కేంద్రంలోని 30 పడకల ఆరోగ్య ప్రభుత్వఆసుపత్రికి అత్యవసరసేవలకై అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని గురువారం నాడు సిపిఎంపార్టీ ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి వంశీకృష్ణ వినతి పత్రం అందజేశారు.సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు మురళి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి గతంలో మంజూరైన అంబులెన్స్ జిల్లా కేంద్రానికి తరలించడం జరిగిందని అన్నారు.ఉమ్మడి మండలంలోని ప్రజలు అత్య వసర వైద్య సేవలకై ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే వ్యయ ప్రయాసలతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ,ఒక్కోసారి అనారోగ్య బాధితులు ప్రాణాలు కూడా కోల్పోతున్నారన్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పించే విధంగా వైద్య అధికారులు,ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు.అంబులెన్స్ సౌకకర్యం కల్పించని ఎడలపార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆశన్న,ఈశ్వర్,రామకృష్ణ,నవీన్ పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్య అధికారికి వినతి పత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

## కెటిదొడ్డి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం..

**కెటిదొడ్డి,జనవరి 04 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల కెటిదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం కెటిదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని తహసిల్దార్ సరితారాణి, సర్పంచ్ పావని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెటిదొడ్డి గ్రామంలో ఉన్న రేషన్ కార్డులు 616 ఉండగా గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు 566 వచ్చాయని, అదేవిధంగా కొత్త రేషన్ కార్డుల కోసం 295 దరఖాస్తులు, వితంతు పెన్షన్ కోసం 8 దరఖాస్తులు వచ్చాయని తహసిల్దార్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అభయహస్తం ద్వారా అందించే ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందజేయడం జరుగుతుందని అన్నారు. అర్హులైన పేదలందరికి ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో



ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

డిప్యూటి తహసిల్దార్ శివశంకర్, ఎంపిటిసి భీమన్న, పంచాయతీ కార్యదర్శి రంగన్న, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, సిసిలు, ఆశావర్కర్లు, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు కె. విష్ణుచిత్తుడు, గుంతబాయి శ్రీను, శేషాద్రి, వార్డు సభ్యులు పిల్లి శ్రీనివాసులు, రామకృష్ణ, జంగిలప్ప, మహదేవ్, వీరన్న, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అవినీతి రహిత ప్రజాపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం...

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి ఎన్ని నిధులు ఖర్చు చేశారు, ఇంక ఎంత మేర పనులు నిలిచిపోయాయని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటి వరకు 30-40శాతం పనులు పూర్తి కాలేదని, అసలు ప్రధాన కాలువల పని అలాగే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పూర్తి నివేధికలు అందించాలన్నారు. అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, అందువల్ల బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రిని కోరారు. ఇరిగేషన్ సందర్భంగా ఆయన మాట్లా





డుతూ అచ్చంపేట నియోజకవర్గానికి సాగునీటికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం క్రింద నార్లపూర్ నుంచి నీరు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అచ్చంపేటలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశారు కానీ అందులో తగిన సిబ్బంది, వైద్య యూనిట్లు లేవని,168 మంది వైద్య సిబ్బంది ఉండాలని, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్దం చేసి వైద్య శాఖకు పంపించాలని తెలిపారు. అదే విధంగా కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ అచ్చంపేట ఎమ్మెల్యే లేవనెత్తిన అంశాలపైనే సమీక్షలో మాట్లాడారు. మిషన్ భగీరథ, వైద్యం, ఇంజనీరింగ్ అధికారులకు ప్రశ్నలు సంధించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ రాములు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖపై ఒక రోజు పూర్తి సమీక్షా చేయాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రఘుపతిపేట కల్వకుర్తి మధ్య ఉన్న రామగిరి వంతెన పనులు ఆగిపోయాయని, దానిని పూర్తి చేస్తే ప్రజల రాకపోకలకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి రామగిరి వంతెన పనులు వెంటనే తిరిగి ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశానికి విచ్చేసిన ఎస్పీ వైభవ్ గైక్వాడ్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, సీతారామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## కరెంటు షాక్‌తో రెండు గుడిసెలు దగ్ధం

**కెటిదొడ్డి,జనవరి 04 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కెటిదొడ్డి మండల పరిధిలో బుధవారం రాత్రి శివరంగాపురం గ్రామ పొలంలో గుడిసెలు వేసుకుని నివాసం గల కొండాపురం నర్సింహులు తండ్రి గోపాల్, ఆనంద్ తండ్రి గోపాల్ ఇద్దరు అన్నదమ్ముల గుడిసెలు కరెంటు షాక్‌కు గురై రెండు గుడిసెలు తగులబడి పూర్తిగా కాలిపోగా అందులో అందులో ఉన్న డబ్బులు, బంగారం, ధాన్యం ఇంటి సామాగ్రిలు పూర్తిగా కాలిపోయి ఇరువురికి దాదాపు ఎనిమిది లక్షల రూపాయల నష్టం వాటిల్లగా కెటిదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కెటిదొడ్డి ఎస్సై వై. వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


## ప్రజాపాలనను ప్రారంభించిన సర్పంచ్



**కోయిల్‌కొండ,జనవరి 04 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చంద్రాస్‌పల్లి గ్రామంలో గురువారం గ్రామసర్పంచ్ గోపాల్ మండల అధికారులతో కలిసి ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామంలోని ప్రజలంతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఈఓ ఆర్‌డి నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా కలెక్టర్‌ను కలిసిన తహసిల్దార్

**ఇటిక్యాల,జనవరి 04 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఐఎఎస్‌లను బదిలీ చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అదనపు కార్యదర్శిగా పని చేస్తున్న బిఎ సంతోష్‌ను జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌గా నియమించడంతో గురువారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చాంబర్‌లో ఇటిక్యాల తహసిల్దార్ వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.



## ప్రజా పాలనలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ : ఎంపిడిఓ గీతాంజలి



**లింగాల,జనవరి 04 ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ప్రజాపాలనలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. శ్రీరంగాపూర్‌లో 164, చెన్నంపల్లిలో 494, బాకారం 185, జీల్గుపల్లిలో 415, శాయిన్‌పేట 629, అప్పాపూర్‌పెంట 170, లబ్దిదారుల నుంచి తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు గడువు ఉందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాబు భోజనాలు ఎలా ఉన్నాయి..

**విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జీఎంఆర్**



**కొత్తకోట,జనవరి 4,ప్రభాతవార్త :** ఏం బాబు మీ పాఠశాలలో భోజనాలు ఎలా ఉన్నాయి మెను ప్రకారం భోజనాలు పెడుతున్నారా అన్నం కూరలు ఎలా చేస్తున్నారు.అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురువారం మదనపురం మండలం అజ్జకొలు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.అనంతరం విద్యార్థి,విద్యార్థులతో మాట్లాడారు.పాఠశాలలో విద్య బోధన,భోజన వసతి,మెను ప్రకారం భోజనం వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా పాఠశాల మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.పాఠశాల భవనం గురించి,మౌలిక వసతుల గురించి డీఈవోతో ఫోన్‌లో మాట్లాడారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కన్న కొడుకును కడ తేర్చిన కసాయి తండ్రి..

**భార్యపై అనుమానంతో ముక్కు పచ్చలారని పసికందును హతమార్చిన వైనం...**



**అయిజ, జనవరి 4, ప్రభాతవార్త:** పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ కాలనీలో కన్న తండ్రి కన్న కొడుకును కడతేర్చిన ఘటన కన్నతండ్రి తీర్చిన ఘటన గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన భార్గవ్ తల్లి కుమారి, భార్య శ్రావణితో కలిసి జీవిస్తున్నారు. భార్గవ్, శ్రావణి దంపతులకు 5 సంవత్సరాల కిందట వివాహం కాగా ఒక బాబు, పుట్టాడు. బాబుకు ప్రస్తుతం రెండు సంవత్సరాల వయస్సు, మొదటి నుండి భార్గవ్ భార్య శ్రావణి పై అనుమానం పెంచుకుని వేధిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఇటీవల భార్యభర్తల మధ్య గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయి. భార్యను ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంచి ఇబ్బందికి గురిచేశాడు. మనస్థాపానికి గురైన శ్రావణి ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. వారి రెండు సంవత్సరాల బాబును భార్గవ్ తన వద్ద ఉంచుకున్నాడు. భార్యపై ఉన్న కోపంతో రెండేళ్ల కుమారుడికి నిద్ర మాత్రలు ఇచ్చాడు. దీంతో బాలుడు అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందాడు. దీంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలానికి శాంతినగర్ సిఐ శివశంకర్ గౌడ్ చేరుకుని విచారణ చేపట్టారు. విషయమై అయిజ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి..

**- ఆరుగ్యారంటీలకు దరఖాస్తులు చేసుకోవాలి.. - 24వ వార్డు కౌనల్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి4, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరుగ్యా రంటీలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డు పద్మావతీ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన వార్డు సభలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారంటీను తప్పక అమలు చేయాలన్నారు. వార్డు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పార్కులో టెంట్ ఏర్పాటు చేసి, తాగునీటి సదుపాయం కల్పించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు ఆఫీసర్ రమేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారను.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి, అధికారులు

## ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు..

**బిజినేపల్లి, జనవరి 04 ప్రభాతవార్త :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం నుంచి బాలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు అన్ని గ్రామాల్లో ఇంటింటికి అందజేస్తున్నారు. అన్ని గ్రామాల్లోని ప్రధానాలయాల్లో గురువారం అక్షింతలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో నిర్మాణం జరుగుతున్న శ్రీరాముని దివ్య భవ్య మందిర ప్రాంభోత్సవం జనవరి 22, 2024న జరగనున్న నేపథ్యంలో ఈ వేడుకను ప్రతి ఇంట జరుపుకునే విధంగా తీర్థ ట్రస్టు నిర్ణయించింది. వేడుకను పురస్కరించుకుని దేశంలోని ప్రతిహిందూ కుటుంబానికి అయోధ్యలోని బాలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు, రామాలయ చిత్రపటము చేర్చాలని శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్టు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అయోధ్య నుండి తీసుకొచ్చిన అక్షింతలు శ్రీరామ సేవకుల ద్వారా ఇంటింటికి పంపిణీ చేయడం భక్తిభావం మధ్య ఓలలాడింది. ప్రతి ఇంటికి అక్షింతలు అందేవిధంగా నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ, వివిధ క్షేత్ర కార్యకర్తలు, వివిధ హిందూ ధార్మిక సంస్థలు పాల్గొన్నారు.




అయోధ్య రామయ్య అక్షింతలు ఇంటింటికి చేరవేస్తున్న రామ సేవకులు

## పారిశుధ్ధ్యంపై ప్రత్యేక దృష్టి..

**బిజినేపల్లి, జనవరి 04 ప్రభాతవార్త :** పోలేపల్లి గ్రామంలో పారిశుద్ద్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ గంగారం అశోక్ అన్నారు. గురువారం గ్రామంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఇప్పటికే గ్రామంలో దాదాపు 3 కి.మీ.లు రూ. 10 లక్షల వ్యయం ఖర్చు చేసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. ఇప్పటికే గ్రామంలో పూర్తిస్తాయిలో సిసి రోడ్లు పూర్తయినట్లు వివరించారు. ఇప్పటికే గ్రామంలో పూర్తిస్థాయిలో సిసిరోడ్లు పూర్తయినట్లు వివరించారు. ఆయా వాడల్లో ఎక్కడ అపరిశుభ్రంగా లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. రోడ్లపై మురుగునీరు చేరడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అలాగే రోడ్లపై వెళ్లే పాదచారులకు, వాహనదా రులకు తీవ్ర ఇబ్బందులు కలగకుండా సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీపనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని ప్రజలు సైతం పరిసరాల పరిశుభ్రత పాటించాలని వీలైంత తలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గంచుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అప్పుడే ఆరోగ్యవంతమైన గ్రామాలను తయారు చేసుకోగలుగుతామని చెప్పారు.


పోలేపల్లిలో అండర్ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ గంగారం అశోక్

## ఏడాదిలో ఒక్క సెలవు తీసుకోని ప్రభుత్వ టీచర్..!!

**సన్మానించిన ఉపాధ్యాయ బృందం..**

**భూత్పూర్, జనవరి4, ప్రభాతవార్త :** వారానికో సెలవు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులుంటున్న ప్రస్తుత స మాజంలో ఏడాదిలో ఒక్క సెలవు కూడా తీసుకోకుండా అంకితభావంతో పని చేస్తూ 18మంది పిల్లలున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 66 మంది వరకు పెంచి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఓ ప్రభుత్వ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలి ఉదంతం భూత్పూర్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే భూత్పూర్ మండలం లంబడి కుంట తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యారాలిగా పనిచేస్తున్న నసీమున్నిస్సా బేగం 2022-23 విద్యాసంవత్సరంలో ఒక్క సెలవు కూడా తీసుకోలేదు. వాస్తవానికి మహిళా ఉపాధ్యాయులకు ఏడాదిలో 27సెలవులు, మగవారికి 22సెలవులుంటాయి. అయితే ఏడాదిలో 27సెలవులకుగాను నసీమున్నిస్సా బేగం ఒక్క సెలవు కూడా తీసుకోకుండా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు ఐడి కార్డులు, డైరీలు, వ్యాయామం, ఆటలు తదితర అంశాలతో శ్రద్ధ కనబర్చి విద్యార్థుల్ని ఉత్తమోత్తములుగా తీర్చిదిద్దారని అధికారులు ఈమెను బెస్ట్ టీచర్‌గా ఎంపిక చేసి మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టంర్లు లావణ్య(ఎల్కి చర్ల), ఆనందమ్మ(భూత్పూర్), లక్ష్మినారాయణ(తాటికొండ)తో పాటు క్లస్టర్ సీఆర్‌పి ఇక్రమ్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొని నసీమున్నిస్సా బేగం పూలమాలలు, శాలువలతో సన్మానించి అభినందించారు.


నసీమున్నిస్సా బేగంను సన్మానిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, సీఆర్‌పి ఇక్రమ్ తదితరులు

# మాజీ ఎమ్మెల్యే సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డికి పలువురి నివాళి..!!


అన్నాసాగర్‌లో ఆల శశివర్ధన్‌రెడ్డి భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్)




ఆల శశివర్ధన్‌రెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల, అంజయ్యయాదవ్, రాజేందర్‌రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ

**-అంతిమ సంస్కారాలకు హాజరైన పలువురు రాజకీయ ప్రముఖులు..**
**-అశ్రునయనాల మధ్య ఆల శశివర్ధన్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు..**
**-అన్న శశివర్ధన్‌రెడ్డి పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి..**

**భూత్పూర్, జనవరి 4, ప్రభాతవార్త :** దేవరకద్ర మాజీ శాసనసభ్యుడు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు(భ్రాత) ఆల శశివర్ధన్‌రెడ్డి గురువారం తెల్లవారుజామున తన స్వగ్రామం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని తన నివాసంలో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విషయం తెల్సుకున్న పలువురు రాజకీయ ప్రముఖులు హుటాహుటిన అన్నాసాగర్‌కు చేరుకుని ఆల శశివర్ధన్‌రెడ్డి భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆల కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఓదార్చారు. ఆల శశివర్ధన్‌రెడ్డి భౌతిక కాయాన్ని మధ్యాహ్నం ఆల కుటుంబీకులు తమ వ్యవసాయ పొలం వద్ద అంతిమ సంస్కారాలు నిర్వహించారు. భ్రాత ఆల శశివర్ధన్‌రెడ్డి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చెందడంతో పాటు అన్న అంతిమ సంస్కారంలో అన్న భౌతిక కాయాన్ని పాడె మోసి అన్న పట్ల తనకున్న ప్రేమ, అనుబంధం, ఆప్యాయతను చాటారు. ఆల శశివర్ధన్‌రెడ్డికి నివాళులర్పించిన వారిలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్), ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాల్‌రాజ్, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, డీకే అరుణ, మాజీ ఎంపి ఎపి జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపూర్ వెంకటేశ్వర్‌రెడ్డి, మన్నె జీవన్‌రెడ్డితో పాటు భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి, అడ్డాకుల జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, ముడా డైరెక్టర్లు సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, మూస సాయిలు, బాలమణెమ్మ, ఉంద్యాల వెంకటేశ్వర్‌రెడ్డి, నరోత్తమ్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళిధర్‌గౌడ్, మూస బాలస్వామి, గడ్డం ప్రేమ్, గడ్డం రాములు, బోరింగ్ నర్సింహులు, సత్తూర్ సురేష్‌గౌడ్‌తో పాటు నియోజకవర్గంలోని పలు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అశ్రునయనాలతో ఆల శశివర్ధన్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు పలికారు.


శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి


పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


శ్రద్ధాంజలి ఘటిస్తున్న మన్నె జీవన్‌రెడ్డి తదితరులు

## ప్రజా పాలనలో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు..

**మునగాల, చాగాపురం ప్రజాపాలనలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు**

**ఇటిక్యాల, జనవరి 04 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిని అర్హులను గుర్తించి పథకాలు అమలు చేస్తారని ప్రతి ఒక్కరు దరఖాస్తులు చేసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం మండల పరిధిలోని మునగాల, చాగాపురం గ్రామాలలో కొనసాగిన ప్రజాపాలన కార్యక్రమంలో స్థానిక జడ్పీటిసి హనుమంతురెడ్డితో కలిసి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ప్రజాపాలనలో అధికారులు ప్రజలకు దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని అలాగే ఇబ్బందులు లేకుండా చూడాలని సంక్షేమ పథకాల కొరకు ప్రజలు అధికారుల దగ్గర దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దూరంగా ఉమ్మడి ఇటిక్యాల మండలంలో గురువారం మునగాల, చాగాపురం, కొండేరు, జింకలపల్లి గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. ఈ గ్రామాలలో ప్రత్యేక అధికారులుగా తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ రాఘవ, ఇంఛార్జి తహసిల్దార్ నందిని, ఎంపిఓ భాస్కర్ యాదవ్‌లు విధులు నిర్వహించారు. నాలుగు గ్రామాలలో ఆయా గ్యారంటీ వాళ్లకోసం 2339 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పుల జయలక్ష్మి, నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, రఘురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటన్న, రామన్‌గౌడ్, రవి, కాంగ్రెస్ నాయకులు, సీనియర్ అసిస్టెంట్ అజిత్, ఆర్ఐ భీమ్‌సేన్‌రావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీ సభ్యులు పాల్గొన్నారు.


ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అధికారులు, నాయకులు



## ప్రజా పాలనలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలు అమలు..

**కొండేరు ప్రజాపాలనలో మాజీ ఎంపి మంద**

**ఇటిక్యాల, జనవరి 04 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలనలో భాగంగా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీ పథకాలు 100 రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజల సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను అధికారులు తీసుకుంటున్నట్లు మాజీ ఎంపి మంద జగన్నాథం అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండేరు గ్రామంలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, మాజీ ఎంపి మంద జగన్నాథం, మంద శ్రీనాథ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి మంద జగన్నాథం మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఆదరించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను అర్హులైన వారికి అందిస్తుందని రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, గృహలక్ష్మి, చేయూత వంటి పథకాలు 100 రోజుల్లోనే ప్రభుత్వం అమలు చేస్తుందని ఇందిరమ్మ ఇండ్లు అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుకొస్తుందని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు అధికార యంత్రాంగం పని చేస్తుందని అర్హులైన వారందరూ పథకాలకు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఇలాంటి కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వీరన్న, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పోతురాజు సోమనాద్రి, నీలి శ్రీనివాసులు, వెంకటేష్ యాదవ్, మధునాయుడు, యువరాజు, యోహాన్, ఇంఛార్జి తహసిల్దార్ నందిని, పంచాయతీ కార్యదర్శి మస్తాన్ వలీ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న మాజీ ఎంపి మంద జగన్నాథం, ఇంఛార్జి తహసిల్దార్ నందిని

### గోతులు తీశారు మరమ్మతులు మరిచారు..

## అదుపు తప్పితే అదోగతి..

**ఉప్పునుంతల, జనవరి 04 ప్రభాతవార్త :** ఉప్పునుంతల నుంచి గట్టుకాడిపల్లి, కంసాన్‌పల్లి మీదుగా డిండి చింతలపల్లి ప్రధాన రహదారిపై ఇటీవల బీటీ పరిచారు. అక్కడక్కడ కల్వట్ల నిర్మాణం కోసం ఇరువైపులా గోతులు తీసి వదిలేశారు. దీంతో ఆ మార్గం గుండా వెళ్లే వాహన చోదకులు ఏమాత్రం జాగ్రత్తలు పాటించకపోతే భారీ ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న కల్వర్టు నిర్మాణం కోసం తీసిన గోతిని మరమ్మతులు చేపట్టకుండా సదరు కాంట్రాక్టర్ వదిలేసి వెళ్లారు. ఉప్పునుంతల నుంచి ఈ రోడ్డు మార్గం గుండా రాత్రింబవళ్లు వాహనాలు తిరుగుతుంటాయి. ఆదమరిస్తే అదోగతి అనే పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గట్టుకాడిపల్లి సమీపంలో కల్వర్టు ఇరుకుగా ఉండడంతో పాటు రోడ్డు లెవల్‌తో ఉండడంతో ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఆ ప్రాంతంలో గోతిలో పడే ప్రమాదం ఉంది. దగ్గరికి వచ్చేంతవరకు కల్వర్టు కనిపించకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందని భయాందోళనకు గురవుతున్నారు. ఉప్పునుంతల నుంచి ఒంగోలు మండల కేంద్రంలో లింకులు కలిపే డబుల్ రోడ్డు పనుల పట్ల సదరు కాంట్రాక్టర్ పూర్తి నిర్లక్ష్యంతో పనులు చేపట్టడంతో ప్రమాదం అంచున ఉన్న కల్వర్టుల వద్ద పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ప్రమాదం జరగక ముందే జాగ్రత్తగా తెలుసుకోవాలని పలువురు కోరు తున్నారు. చేతులు కాలకుండా జాగ్రత్తలు పాటిస్తే మంచిది ప్రమాదం జరిగాక చొరవ తీసుకుంటే ఏం ఉపయోగం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.


ఉప్పునుంతల, కంసాన్‌పల్లి మార్గంలో ప్రమాదంగా మారిన కల్వర్టు

## 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**దేవరకద్ర, జనవరి 04 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం ముచ్చింతలలో గురువారం 2024 సంవత్సరపు కాంగ్రెస్ పార్టీ క్యాలెండ ర్‌ను ఎమ్మెల్యే జి.మదుసూధనరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, గోపన్‌పల్లి యూత్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, బుచ్చన్నలతో పాటు గోపన్‌పల్లి గ్రామా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నట్లు బుచ్చన్న తెలిపారు.

## ఐఎన్‌టీఎస్‌ఓ ఒలంపియాడ్ పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 04 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ స్థానిక ఈశ్వర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నవంబర్‌నెలలో నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌ఓ లెవల్-1 ఒలంపియాడ్ పరీక్షలో పాల్గొని లెవల్-2కి 106 మంది విద్యార్థులు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ రాజీవ్ ప్రియదర్శన్ తెలిపారు. ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థులు అర్హత సాధించడంతో ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కోఆర్డినేటర్ మధుసూదన్, డీఎన్ శివకుమార్, ఉపాధ్యాయ విద్యార్థులను అభినందించారు.

## కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన..

**ప్రజా సంక్షేమం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే**

**చిన్నచింతకుంట, జనవరి 04 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల వద్దకు పాలన తీసుకొస్తుందని స్థానిక ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం కురుమూర్తి, ముచ్చింతల గ్రామాల్లో అభయహస్తం గ్రామ సభలలో ఆయన పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం అభివృద్ధి ధ్యేయం గా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని ఇప్పటికే రెండు పథకాలను అమలు పరిచామని మిగతా వాటిని త్వరలో అమలు చేస్తామని ఆయన తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ఆయ న తెలిపారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరు అభయహస్తం గ్రామ సభల్లో దరఖాస్తులు సరళిని అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశాల్లో కురుమూర్తి గ్రామ సర్పంచ్ కవిత, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిఓ అనిల్, కో ఆప్షన్ మహమూద్, నాయకులు కథలప్ప, ఎస్. వెంకటేష్, సురేష్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు..

**బిజినేపల్లి, జనవరి 04 ప్రభాతవార్త :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం నుంచి బాలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు అన్ని గ్రామాల్లో ఇంటింటికి అందజేస్తున్నారు. అన్ని గ్రామాల్లోని ప్రధానాలయాల్లో గురువారం అక్షింతలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో నిర్మాణం జరుగుతున్న శ్రీరాముని దివ్య భవ్య మందిర ప్రాంభోత్సవం జనవరి 22, 2024న జరగనున్న నేపథ్యంలో ఈ వేడుకను ప్రతి ఇంట జరుపుకునే విధంగా తీర్థ ట్రస్టు నిర్ణయించింది. వేడుకను పురస్కరించుకుని దేశంలోని ప్రతిహిందూ కుటుంబానికి అయోధ్యలోని బాలరాముని పూజలో ఉపయోగించిన అక్షింతలు, రామాలయ చిత్రపటము చేర్చాలని శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్టు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అయోధ్య నుండి తీసుకొచ్చిన అక్షింతలు శ్రీరామ సేవకుల ద్వారా ఇంటింటికి పంపిణీ చేయడం భక్తిభావం మధ్య ఓలలాడింది. ప్రతి ఇంటికి అక్షింతలు అందేవిధంగా నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ, వివిధ క్షేత్ర కార్యకర్తలు, వివిధ హిందూ ధార్మిక సంస్థలు పాల్గొన్నారు.

## క్రీడకారిణిని సన్మానించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**పెబ్బేరు, జనవరి 4, ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాలకు చెందిన నందిని గురువారం ఎమ్మెల్యే మేఘా రెడ్డి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. డిసెంబర్ 23న బిజినపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన అండర్ 17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రతి భ కనబరిచి రాష్ట్రసాయికి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించి చదువుతో పాటు క్రీడలపై కూడా శ్రద్ధ వహించిన పదవ తరగతి చదివే విద్యార్థిని నందినిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల నాయకులు శ్రీనివాస్ గౌడ్, సు రేందర్ గౌడ్ వెంకటరమణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.